TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 155 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ మంగళవారం.30.12.2025 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## చట్టసభలు ప్రజాస్వామ్యానికి ప్రతీక

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: శాసన మండలి, శాసనసభ రెండు చట్టసభలు ప్రజాస్వామ్యానికి ప్రతీకలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సభ్యుల ప్రశ్నలకు సంతృప్తికరంగా సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి, మంత్రులపై ఉంటుందని చెప్పారు. సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో సీనియర్ అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలనీ, పారదర్శకంగా, వేగంగా మంత్రులకు, సభ్యులకు సమాచారం అందించాల్సి ఉంటుందని వివరించారు. సోమవారం శాసనసభ ప్రాంగణంలోని మొదటి సమావేశ మందిరంలో మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబుతో కలిసి సీనియర్ అధికారులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ అత్యంత ప్రజాసామికంగా సభ జరపాలంటూ ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచన చేస్తున్నదనీ, ప్రజలకు, సభ్యులకు జవాబుదారీగా ఉండాలన్న దృఢ సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశాలకు మంత్రులు చాలా సీరియస్‌గా ప్రిపేర్ అయి వస్తున్నందున అధికారులు కూడా అందుకు అనుగుణంగా పూర్తి సమాచారంతో సభలు జరిగినన్ని రోజులు అందుబాటులో ఉండాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభలు అత్యంత పవిత్రమైనవనీ, ఈ సభకు వచ్చే సభ్యులు గొప్ప ఆశయాలు, లక్ష్యాలతో వస్తున్నారన్న విషయాన్ని అధికార యంత్రాంగం గుర్తించాలని సూచించారు.

ప్రజలకు ఏదో మేలు చేయాలన్న తపనతో ప్రతి సభ్యుడు సభకు వస్తారనీ, ప్రజల సమస్యలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఏదో ఒక సమాధానం రాబట్టాలన్న ఆలోచనలతో సభ్యులు ఉంటారు కాబట్టి అధికారులు అన్ని ప్రశ్నలకూ పారదర్శకంగా, పూర్తి సమాచారంతో సభకు హాజరై మంత్రులకు తాను వెంటనే సమాచారం ఇచ్చి సభ ద్వారా సంతృప్తికర సమాధానాలు వెళ్లేలా అధికారులు అవసరమైన జాగ్రత్తలు చేపట్టాలన్నారు. సభ జరిగే సమయంలో లైవ్ ప్రసారాల ద్వారా సభను రాష్ట్రంలోని ప్రజలే కాదు, దేశవ్యాప్తంగా ఉన్నవారు ఆసక్తిగా చూస్తారనీ, బయట ప్రభుత్వం ఎంత విజయవంతంగా పరిపాలన అందిస్తుందో అదే తరహాలో సభలోనూ ప్రతిభను చూపాల్సిన అవసరం ఉంటుందని అన్నారు. అందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఉభయ సభలకు సంబంధించిన సమాచారాన్ని అధికారికంగా ధ్రువపరుచుకోకుండా మీడియాలో ఇష్టారీతిన ప్రచురణ లేదా ప్రసారం చేస్తే అది చట్టసభల హక్కుల ఉల్లంఘన కిందికి వస్తుందని చెప్పారు. సమావేశాలకు సంబంధించి మీడియాలో వచ్చిన సమాచారంపై సమాచార శాఖ అధికారులు



పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు.

చట్టసభల గౌరవాన్ని, ఔన్నత్యాన్ని పెంచేలా సభలు నిర్వహిద్దాం : శ్రీధర్‌బాబు

చట్టసభల గౌరవాన్ని, ఔన్నత్యాన్ని పెంచేలా ఉభయ సభలు నిర్వహించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉందనీ, అందుకు అధికారుల నుంచి సంపూర్ణ సహకారం ఉండాలని ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అధికారులకు సూచించారు. ప్రతిరోజు ఉదయాన్నే మీడియాలో వచ్చిన వివిధ అంశాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి సభ్యులు ప్రశ్నలు లేవనెత్తితే మంత్రులు సమాధానం ఇచ్చేందుకు పూర్తి సమాచారంతో సభలో అందుబాటులో ఉండాలని కోరారు. జీరో అవర్‌లో సభ్యుల ప్రశ్నలకు అవసరమైన సమాధానాలు అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధం చేయాలని సూచించారు.

పెండింగ్ నివేదికలు, హామీలకు సంబంధించిన అంశాల పూర్తి సమాచారంతో అధికారులు సిద్ధంగా ఉండాలని అన్నారు. అసెంబ్లీ, మండలి కార్యదర్శులు ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, శాసనమండలి కార్యదర్శి నరసింహాచార్యులు, అసెంబ్లీ కార్యదర్శి తిరుపతి, సీనియర్ అధికారులు వికాస్‌రాజ్, దానకిషోర్, జయేష్ రంజన్, రఘునందన్‌రావు, శ్రీధర్, నదీమ్ అహ్మద్, శైలజ రామయ్యర్, యోగితారానా, లోకేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ నుంచి వెంటనే ఎందుకు వెళ్లారో కేసీఆర్‌నే అడగాలి : రేవంత్ రెడ్డి


హైదరాబాద్, అమృత్ తెలంగాణ: మాజీ సీఎం కేసీఆర్‌ను అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రతి సభ్యుడిని తాము గౌరవిస్తామని, కేసీఆర్‌ను ఇవాళే కాదు, ఆస్పత్రిలో కూడా కలిశానని గుర్తు చేశారు. అసెంబ్లీ నుంచి వెంటనే ఎందుకు వెళ్లారో ఆయన్నే అడగాలని అన్నారు. ఇద్దరూ ఏం మాట్లాడుకున్నారని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. దీనికి ఆయన మేమిద్దరం మాట్లాడుకున్నది మీకెలా చెబుతాం? అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ప్రారంభమైన తరువాత కేసీఆర్



వద్దకు రేవంత్ రెడ్డి వెళ్లారు. కరచాలనం చేస్తూ బాగున్నారా అని రేవంత్ రెడ్డి పలకరించారు

## జనవరి 2 నుంచి 7వరకు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, అమృత్ తెలంగాణ: శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన బీఏసీ(బిజినెస్ అడ్వయిజరీ కమిటీ) సమావేశం జరిగింది. అసెంబ్లీ సమావేశాలపై బీఏసీ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జనవరి 2 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించారు. స్పీకర్ ఛాంబర్లో జరిగిన బీఏసీ సమావేశానికి ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్బాబు, పొన్నం ప్రభాకర్లు హాజరయ్యారు. మహేశ్వర్‌రెడ్డి, అక్బరుద్దీన్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అసెంబ్లీ పనిదినాలు ఎజెండాను ఈ సమావేశంలో ఖరారు చేశారు. 15 రోజులు సమావేశాలు జరపాలని పట్టుపట్టాం : బీఏసీ సమావేశం ముగిసిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్రావు మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలు 15 రోజులు జరపాలని పట్టుపట్టామని వివరించారు. వారం రోజులు జరిపి మళ్లీ బీఏసీ పెడతామన్న స్పీకర్ చెప్పారన్న హరీశ్రావు అసెంబ్లీలో పీపీటీ ఇచ్చేందుకు అవకాశం ఇవ్వాలని కోరామన్నారు. ఆలోచించి నిర్ణయం తీసుకుంటారని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారని ఆయన వివరించారు. గతంలో కాంగ్రెస్కు అవకాశం ఇవ్వనందుకు బహిష్కరించామని భట్టి విక్రమార్క అన్నారని హరీశ్ గుర్తుచేశారు. ఇప్పుడు మీరు(కాంగ్రెస్ ప్రభుత్వం) ఇవ్వకపోతే వేము బాయ్కాట్ చేయాలా అని అడిగామన్నారు. 32 అంశాలపై చర్చించాలని కోరాం : బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ శాసనసభ సమావేశాలు కనీసం 20 రోజులైనా నిర్వహించాలని కోరామన్నారు. 32 అంశాలపై చర్చించాలని కోరినట్లుగా వివరించారు.



జనవరి 2 నుంచి 7 వరకు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారని వివరించారు. జనవరి 7న మళ్లీ బీఏసీ సమావేశం ఉంటుందని తెలిపారు. 2 రోజులు సమావేశాలు పెట్టి చేతులు దులుపుకోవటం సరికాదని వివరించారు."రాష్ట్రం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతూ ఉంది. వాటిపై చర్చించే దమ్ము, ధైర్యం లేనటువంటి ప్రభుత్వం, మళ్లీ యథావిధిగా మూడు నాలుగు రోజుల్లో శీతాకాల సమావేశాలు ముగించేవిధంగా మాట్లాడుతున్నారు. కాళేశ్వరం, అనేక అంశాలపై దర్యాప్తు చేయించి బాధ్యులను జైల్లో పెడతానని హామీ ఇచ్చి కాలయాపన చేస్తున్నారు. ఎన్నికల ముందు బీసీ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పేరుమీద అనేక హామీలు ఇచ్చారు. వాటిపై చర్చించే దమ్ము, ధైర్యం ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నిస్తున్నా. ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో చర్చించేందుకు సమయం కూడా ఇవ్వడం లేదు. కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంతో మ్యాచ్ఫిక్సింగ్కు ప్రయత్నిస్తోంది. అసెంబ్లీలో అన్ని అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం"–ఏలేటి మహేశ్వర్రెడ్డి, బీజేపీ నేతఅసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం : తొలి రోజు శాసనసభ సమావేశాల సందర్భంగా దివంగత మాజీ ఎమ్మెల్యేలు రాంరెడ్డి దామోదర్ రెడ్డి, కొండా లక్ష్మారెడ్డిలకు సంతాప తీర్మానాలను శాసనసభ స్పీకర్ సభలో ప్రవేశపెట్టారు. అనంతరం సభ్యులందరూ సంతాపాన్ని తెలిపారు. ఈ సమావేశాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రతిపక్ష నేత, మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ వద్దకు సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లి బాగున్నారా? అని పలకరించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, కోమటిరెడ్డి ఆయనను పలకరించి గౌరవ సూచకంగా అభివాదం చేశారు. సంతాప తీర్మానాల అనంతరం కేసీఆర్ సభ నుంచి నందినగర్లోని ఇంటికిమంత్రులంతా హాజరవ్వాల్సిందే : సభకు మంత్రులు తప్పనిసరిగా హాజరుకావాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. బీఆర్ఎస్ ఉనికిని కాపాడుకునే పనిలో ఉందని అన్నారు. ప్రతిపక్షాలకు కౌంటర్ ఇచ్చేందుకు అమాత్యులు సిద్ధంగా ఉండాలన్నారు. సభలో పాయింట్ అఫ్ ఆర్డర్ ముఖ్యమన్న ఆయన ప్రతిపక్షం అడిగే ప్రతి అంశానికి సమాధానం ఇవ్వాలన్నారు.

## గ్రామీణాభివృద్ధికి అడుగులు పడేనా?

హైదరాబాద్, అమృత్ తెలంగాణ: తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల కొలువుదీరిన 12,702 మంది సర్పంచులు, 1,11,803 మంది వార్డు సభ్యులు గ్రామ పాలనలో కీలక బాధ్యతలు చేపట్టారు. ప్రజాస్వామ్యవ్యవస్థలో గ్రామ పంచాయతీ అనేది పునాదివంటిది. గ్రామ పంచాయతీ బలంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధిబాటలో నడుస్తుంది. అలాంటి గ్రామ పంచాయతీలకు నాయకత్వం వహించే సర్పంచుల పాత్ర అత్యంత కీలకం. అయితే గ్రామాభివృద్ధి అనేది మాటల్లో కాకుండా కార్యరూపంలోకి రావాలంటే సర్పంచులు అనేక సవాళ్లను ఎదుర్కొని, అవగాహనతో, నిబద్ధతతో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గ్రామ సర్పంచుల ముందు నిలిచే మొదటి పెద్ద సవాలు అభివృద్ధి పట్ల సరైన అవగాహన లేకపోవడం. చాలా మంది సర్పంచులు ప్రజా భిమానంతో ఎన్నికైనా, పాలనా విధానాలు, ప్రభుత్వ పథకాలు, నిధుల వినియోగం, చట్టపరమైన అంశాలపై పూర్తి స్థాయి అవగాహన లేకపోవడం కనిపిస్తోంది. ఫలితంగా గ్రామానికి రావాల్సిన నిధులను సద్వినియోగం చేయలేకపో వడం, లేదా పథకాలను పూర్తిగా అమలు చేయలేకపోవడం జరుగుతోంది. కాబట్టి గ్రామాభివృద్ధి కోసం ముందు సర్పం చులే శిక్షణపొందాల్సిన అవసరంఉంది. నిధుల కొరత మరో ప్రధాన సమస్య. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నుంచి గ్రామ పం చాయతీలకు నిధులు వస్తున్నా అవి చాలవు. రోడ్లు, తాగు నీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, పాఠశాలలు, ఆరోగ్య సదు పాయాలు వంటి అనేక అవసరాలకు ఒకేసారి నిధులు అవసరం అవుతాయి. కానీ పరిమిత నిధులతో అన్ని పను లు చేయడం సర్పంచులకుపెద్ద సవాలుగా మారుతోంది. అంతేకాకుండా, కొన్నిసార్లు నిధులు ఆలస్యంగా రావడం వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయి. నిధులు వచ్చినా వాటి సరైన వినియోగం కూడా ఒక పెద్దసమస్యే. సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం, అధికారులపై ఆధారపడాల్సి రావడం వల్ల కొన్ని చోట్లఅవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నా యి. ఇది గ్రామాభివృద్ధికి పెద్ద అడ్డంకిగా మారుతోంది. సర్పం చులు నిజాయితీగా ఉన్నా, వ్యవస్థలోని లోపాలవల్ల ప్రజల్లో వారి మీద నమ్మకం తగ్గేపరిస్థితి ఏర్పడుతోంది. గ్రామాభివృద్ధి లో మరోసవాలు ప్రజల భాగస్వామ్యం లేకపోవడం.అభివృద్ధిఅనేది కేవలం సర్పంచి బాధ్యత మాత్రమే కాదు. గ్రామ ప్రజలందరూ భాగస్వాములు కావాలి. కానీ చాలా గ్రామాల్లో ప్రజలు సమావేశాలకు రాకపోవడం, గ్రామసభలను పట్టించుకోకపోవడం కనిపిస్తోంది. ఫలితంగా సర్పంచులు తీసుకునే నిర్ణయాలకు పూర్తిమద్దతు లభించడంలేదు. ప్రజల సహకారం లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు. రాజకీయ జోక్యం కూడా సర్పంచుల




పనితీరును ప్రభావితం చేసే అంశం. గ్రామస్థాయిలోనే వర్గ పోరులు, రాజకీయ విభేదాలు సర్పంచులు ముందున్న పెద్ద సమస్య. అభివృద్ధి పనులను రాజకీయ కోణంలో చూసి అడ్డుకోవడం, వ్యక్తిగత లాభనష్టా ల కోసం పనులను నిలిపివేయడం జరుగుతోంది. దీనివల్ల గ్రామానికి మేలు చేసే పనులు కూడా ఆలస్యమవుతు న్నాయి. ఇకఅధికారులతో సమన్వయం లోపించడం కూడా ఒక సవాలే. గ్రామ పంచాయతీకి సంబంధించిన పనుల్లో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీర్లు, ఇతర శాఖల అధికారులు కీలక పాత్ర పోషిస్తారు. వీరితో సమన్వయం సరిగా లేకపోతే పనులు ముందుకు సాగవు. కొన్నిసార్లు అధికారులు నిర్లక్ష్యం, ఆలస్యంవల్ల సర్పంచులు ప్రజల విమర్శలకు గుర వుతున్నారు. అయితే ఈ సవాళ్ల మధ్య సర్పంచులు చేయా ల్సిన బాధ్యతలు మరింత పెరుగుతున్నాయి. కేవలం ప్రభుత్వ నిధులపై ఆధారపడకుండా స్థానికంగా నిధులు సృష్టించుకో వడం నేటి అవసరం. గ్రామపంచాయతీ పరిధిలోని మార్కె ట్లు, వారపుసంతలు, దుకాణాలు, ప్రకటనల ద్వారా ఆదాయం పెంచుకోవచ్చు. ఆస్తిపన్ను, నీటి పన్నువంటి వాటిని సమర్థ వంతంగా వసూలు చేయడంద్వారా కూడా గ్రామానికి ఆదా యం సమకూర్చుకోవచ్చు. ఈ విషయంలో సర్పంచులు ధైర్యంగా, పారదర్శకంగావ్యవహరించాలి. అలాగే సాంకేతిక పరిజ్ఞానం వినియోగం కూడా ఎంతో అవసరం. డిజిటల్ పాలన, ఆన్లైన్ దరఖాస్తులు, పారదర్శక లెక్కల నిర్వహణ ద్వారా గ్రామపాలన మరింత సమర్థవంతంగా మారుతుంది. యువతను గ్రామాభివృద్ధిలో భాగస్వాములుగా చేయడం ద్వారా కొత్తఆలోచనలు, కొత్తమార్గాలు ముందుకువస్తాయి.


## కేవలం ఐదు నిమిషాలే.. అసెంబ్లీ నుంచి వెళ్లిపోయిన కేసీఆర్

హైదరాబాద్, అమృత్ తెలంగాణ: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. సభ ప్రారంభమైన ఐదు నిమిషాల్లోనే బీఆర్ఎస్ అధినేత తిరుగుపయనమయ్యారు. సంతాప తీర్మానాలు ముగిసిన వెంటనే కేసీఆర్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. కాగా.. సోమవారం ఉదయం నందినగర్‌లోని నివాసం నుంచి అసెంబ్లీకి చేరుకున్నారు కేసీఆర్. ఈ సందర్భంగా మాజీ సీఎంకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. ఆపై కేసీఆర్‌ను ఎమ్మెల్యేలు సభలోకి తీసుకెళ్లారు. కేసీఆర్ వెళ్లిన కాసేపటికే తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. మిగతా సభ్యులు అందరికంటే ముందుగానే కేసీఆర్ వెళ్లి తన చైర్‌లో కూర్చున్నారు.సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ హాల్లోకి రాగానే కేసీఆర్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేశారు. అలాగే సీఎం తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా కేసీఆర్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేశారు. ఆపై సభ ప్రారంభం కాగానే కొద్దిసేపు మాత్రమే సభలో ఉన్నారు కేసీఆర్. తర్వాత మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు బయటికి వచ్చారు. అనంతరం అసెంబ్లీ నుంచి తిరిగి నందినగర్ నివాసానికి గులాబీ బాస్ వెళ్లిపోయారు.

కేసీఆర్‌ను కలిసిన సీఎం రేవంత్

అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్ దగ్గరకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ దగ్గరికి వెళ్ళి బాగున్నారా అని సీఎం పలకరించగా.. తిరిగి బాగున్నాను





అంటూ రేవంత్‌కు కేసీఆర్ సమాధానం ఇచ్చారు. అలాగే కేసీఆర్‌ను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, ఆది శ్రీనివాస్ పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సీపీఐ ఎమ్మెల్యే కునమనేని సాంబశివరావు కలిసి కరచాలనం చేశారు.

## కొండగట్టుకు పవన్ కల్యాణ్.. ముహూర్తం ఫిక్స్..

జగిత్యాల, అమృత్ తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టును సందర్శించనున్నారు. జనవరి మూడో తేదీన డిప్యూటీ సీఎం కొండగట్టుకు రానున్నారు. ఈ సందర్భంగా ఆయన కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది.తన పర్యటనలో భాగంగా కొండగట్టులో ఆలయ అభివృద్ధికి సంబంధించి కీలక కార్యక్రమాలను ఆయన చేపట్టనున్నారు. టీటీడీ నిధులతో సుమారు రూ.35 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు ఆలయ మౌలిక వసతులు, భక్తుల సౌకర్యాలను మరింత మెరుగుపరచే దిశగా ఉండనున్నాయి .కొండగట్టు ఆంజనేయస్వామి




ఆలయానికి పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. గతంలో ఏపీ రాజకీయాలకు సంబంధించి ఎన్డీఏ కూటమి పార్టీలతో పొత్తు పెట్టుకుంటున్నట్లు పవన్ కల్యాణ్ ఇదే ఆలయం నుంచి ప్రకటన చేశారు. ఇప్పుడు పవన్ కల్యాణ్ కొండగట్టు అంజన్న ఆలయానికి వస్తుండటంతో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.ఏపీలో సార్వత్రిక ఎన్నికల్లో కూటమి భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కొండగట్టుకు వచ్చి అంజన్న స్వామిని దర్శించుకోవడం పవన్ కల్యాణ్ విశేషంగా భావిస్తున్నారు. ఈ పర్యటన రాజకీయంగా, ఆధ్యాత్మికంగా కూడా ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. పవన్ కల్యాణ్ రాకతో కొండగట్టు ప్రాంతంలో భక్తులు, ఆయన అభిమానుల భారీగా తరలి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# ప్రజావాణి అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ రాజార్షి షా





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సత్వరంగా, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును శాఖల వారీగా పరిశీలించి, సకాలంలో పరిష్కరించాలని సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఉపాధి, భూభారతి తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 110 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుని, దరఖాస్తుదారులకు పురోగతి వివరాలు తెలియజేయాలని ఆదేశించారు. అదేవిధంగా మండల ప్రత్యేక అధికారులు తమ మండలాల్లోని పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా నిరంతరం విద్యా సంస్థలను పర్యవేక్షించాలని, ఆ నివేదికలను ప్రతి వారం సమర్పించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం డిప్యూటీ సెక్రటరీగా పదోన్నతి పొందిన సందర్భంగా జిల్లా కలెక్టర్ ను అధికారులు శాలువాతో సన్మానించి, మొక్కను అందజేశారు. అనంతరం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రీ – మెట్రిక్ ఉపకార వేతనాల ఫ్లెక్సీని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి రాజేశ్వర్, డీఆర్‌డీఓ రవీందర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ ప్రాసెసింగ్, స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహం అందించాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలని, ముఖ్యంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, స్వయం సహాయక సంఘాలకు నూతన తరహా రుణాలు అందించడంపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా బ్యాంకర్లకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కన్సల్టేటివ్ కమిటీ సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ సంవత్సరం సెప్టెంబర్ 2025 మాసంతం వరకు ప్రాధాన్యత రంగాల అడ్వాన్సుల కింద రూ. 4508.78 కోట్లు, వ్యవసాయ రంగం అడ్వాన్సుల కింద రూ. 3347.65 కోట్లు ఉన్నయని అన్నారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకంపై ప్రజలకు, రైతులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులు, వీధి వ్యాపారులకు బ్యాంకులు అధికంగా ఆర్థిక సహాయం అందించి వారిని ప్రోత్సహించాలని సూచించారు. పీఎంఈజీపి (PMEGP), పీఎం ఎఫ్ఎంబి (PMFME), పీఎం విశ్వకర్మ వంటి పథకాల పురోగతిపై అధికారులతో సమీక్షిస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ఈ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లలో కొత్త తరహా లోన్లు ఇవ్వాలని, అలాగే మహిళా స్వయం సహాయక సంఘాలకు (SHGs) వినూత్నమైన నూతన ఆవిష్కరణ ప్రాజెక్టుల కోసం రుణాలు మంజూరు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్.బి.ఐ ఏ.జి.ఎం గోమతి, ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఉత్పల్ కుమార్, నాబార్డ్, వివిధ బ్యాంకుల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జిల్లా పౌర సరఫరాల శాఖ, ఆదిలాబాద్ జిల్లా వినియోగదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినియోగదారుల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వినియోగదారుల కమిషన్ జడ్జి నారాయణరెడ్డి మాట్లాడుతూ, వినియోగదారుల హక్కులను కాలరాసే పెద్ద పెద్ద సంస్థలపై కూడా చట్టం కఠినంగా అమలవుతుందని తెలిపారు. అమెజాన్ వంటి సంస్థలు కోర్టు ఆదేశాలను పాటించకపోతే నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ చేయడం, జైలు శిక్ష విధించడం వంటి చర్యలు తీసుకున్న సందర్భాలు ఉన్నాయని వెల్లడించారు. ఏ వస్తువు కొనుగోలు చేసినా నాణ్యత లోపాలు, ధరల మోసాలు, సేవల లోపాల వల్ల వినియోగదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతులు విత్తనాల్లో నాణ్యత లోపాలు, కల్తీ పురుగుల మందులు, బ్యాంకు చెక్కులు, బీమా సొమ్ము పొందడంలో సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇటువంటి మోసాల నుంచి బాధితులను కాపాడేందుకు వినియోగదారుల ఫోరం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలువురు బాధితులు ఫోరాన్ని ఆశ్రయించి పరిహారం పొందినట్లు వివరించారు. వస్తువులు లేదా సేవల్లో లోపాలు ఉంటే వినియోగదారులు నేరుగా, న్యాయవాది ద్వారా లేదా వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదులపై ఛైర్మన్‌తో పాటు ఒక మహిళా సభ్యురాలు, ఒక పురుష సభ్యుడు విచారణ జరిపి తీర్పు ఇస్తారని చెప్పారు. జిల్లా కమిషన్ తీర్పుపై అసంతృప్తి ఉంటే రాష్ట్ర, జాతీయ కమిషన్‌లను కూడా ఆశ్రయించవచ్చని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు, క్యాట్‌కో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్లుల సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు వినియోగదారుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వినియోగదారుల హక్కులపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఓ నందిని, అధ్యక్షులు బోరేకర్ గంగారం, ప్రధాన కార్యదర్శి క్యాతం వెంకట్ రెడ్డి, జిల్లా వినియోగదారుల ఫోరం ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదేపు మధు, పట్టణ అధ్యక్షులు అజ్జు ఖాన్, బోథ్ డివిజన్ అధ్యక్షులు మెంగని నరసయ్య, కళాశాల ఇన్‌చార్జ్ కుమ్మరి వెంకటేశ్వర్లు, పసుపుల విజయ్, అలుగొంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు.



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అదనపు కలెక్టర్ కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం అదనపు కలెక్టర్, అధికారులు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2026– 27 విద్యా సంవత్సరానికి సంబంధించి, ఉమ్మడి ప్రవేశ పరీక్షల నిర్వహణ గోడ ప్రతులను ఆవిష్కరించారు. 'మీ డబ్బు మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా వివిధ జిల్లా శాఖలకు సంబంధించి నూతనంగా కేవైసీ ప్రక్రియ పూర్తి చేసి, ఆక్టివేట్ చేసిన నూతన బ్యాంకు ఖాతాలను ఎల్డిఎం రామ్ గోపాల్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులకు అందజేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# యూరియాపై ఆందోళన వద్దు:


## కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి– జిల్లాలో యూరియా కొరత ఏమాత్రం లేదని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. యూరియా నిల్వలు, సరఫరా తీరుపై అధికారులతో సమీక్షించిన అనంతరం సోమవారం కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం రైతుల అవసరాలకు అనుగుణంగా 8 వేల మెట్రిక్ టన్నుల (MT) యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొందరు వ్యాపారులు, దళారులు కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను భయాందోళనకు గురిచేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. యూరియా విక్రయ కేంద్రాల వద్ద అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. రైతులు దళారుల మాటలు నమ్మి అధిక ధరలకు యూరియా కొనుగోలు చేయవద్దని, రైతులు తమ అవసరాలకు తగ్గట్టుగా మాత్రమే యూరియాను కొనుగోలు చేయాలన్నారు. ఎక్కడైనా కృత్రిమ కొరత సృష్టించినా లేదా అధిక ధరలకు విక్రయించినా వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు లేదా కలెక్టరేట్ కార్యాలయానికి ఫిర్యాదు చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

# రాష్ట్రంలోని ప్రతి రైతుకు పంట అవసరాలకు సరిపడా యూరియాను తప్పనిసరిగా అందించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.






వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి సోమవారం సాయంత్రం అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో యూరియా పంపిణీపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎక్కడా యూరియా కొరత లేదని స్పష్టం చేశారు. యాసంగి పంటకు అవసరమైన మేరకు యూరియా నిల్వలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులకు యూరియా పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, ఎరువుల కొరతపై వస్తున్న పుకార్లను రైతులు నమ్మవద్దని సూచించారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోజువారీగా యూరియా ప్రారంభ, ముగింపు నిల్వల వివరాలను తప్పనిసరిగా నివేదించాలని తెలిపారు. త్వరలోనే అన్ని జిల్లాలలో ఫర్టిలైజర్ బుకింగ్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని, ఇకపై ఉదయం 7 గంటలకు కాకుండా ఉదయం 6 గంటల నుంచే యూరియా అమ్మకాలు ప్రారంభించాలని మంత్రి తెలిపారు. యూరియా కొనుగోలుకు వచ్చే రైతులకు టెంటు, త్రాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. యూరియా పంపిణీకి సంబంధించి సమస్యలు ఎదురైతే రాష్ట్రస్థాయి హెల్ప్‌లైన్ నంబర్ 1800 599 5779 ను సంప్రదించవచ్చని తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పాల్గొని మాట్లాడుతూ, ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను ఈ నెల 22న జిల్లాలో ప్రారంభించామని తెలిపారు. రైతులు, డీలర్లు, వ్యవసాయ అధికారులకు యాప్‌పై వివిధ ప్రసార మాధ్యమాలు, వ్యవసాయ అధికారుల ద్వారా విస్తృత అవగాహన కల్పించామని పేర్కొన్నారు. ఇప్పటివరకు 4,673 మంది రైతులకు 12,735 బ్యాగుల యూరియాను విక్రయించామని, యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని తెలిపారు. ఎరువుల నిల్వలు, సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి రైతులకు సజావుగా యూరియా అందేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ, జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని స్పష్టం చేశారు. రైతుల అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న యూరియాను పకడ్బందీగా పంపిణీ చేయాలని సూచించారు. యూరియా కొరతపై రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పుకార్లను నమ్మవద్దని ఆయన అన్నారు. మండల స్థాయి వ్యవసాయ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు యూరియా పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని, ఖచ్చితంగా ఉదయం 6 గంటల నుంచే యూరియా అమ్మకాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డిప్యూటీ కలెక్టర్ వంశీకృష్ణ, జిల్లా సహకార శాఖ అధికారి మోహన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

## గ్రీవెన్స్ డే ద్వారా ప్రజా సమస్యలకు పారదర్శకంగా తక్షణ పరిష్కారం

## జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.....

ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు.

గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా వారి సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదు పైన సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి, ఫాలోఅప్ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో చర్యలు తీసుకోవడమే మా ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు.

# రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ చైర్ పర్సన్ గా ఎంఎల్ సీ శంకర్ నాయక్



మిర్యాలగూడ : అమృత్ తెలంగాణ:తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ చైర్ పర్సన్ గా ఎంఎల్సి శంకర్ నాయక్ కు నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా వైస్ చైర్మ పర్సన్స్ గా పూనమ్ చంద్రకళ,విశ్లవత్ లింగం నాయక్,సెడ్ మాకి ఆనంద్ రావ్,కురకుల మల్లిఖార్జున్ లను నియమించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ గా ఎన్నికైన ఎంఎల్సి శంకర్ నాయక్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులు కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షితులు అయ్యేలా కృషి చేస్తానని చెప్పారు. గిరిజనుల సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని,గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు.

# ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" ద్వారా సైబర్ నేరాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి తెలియని లింకులు క్లిక్ చేయొద్దు ప్రమాదంలో పడొద్దు ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" కార్యక్రమంలో భాగంగా సైబర్ అవగాహన పోస్టర్ విడుదల చేసిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ సైబర్ నేరాలు రోజు రోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అప్రమత్తత పెంచడం లక్ష్యంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" అనే ప్రత్యేక సైబర్ అవగాహన కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించే పోస్టర్‌ను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ గారు విడుదల చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..

మీ వ్యక్తిగత సమాచారాన్ని, ముఖ్యంగా పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ వివరాలు, ఓటిపిలను ఎవరితోనూ పంచుకోవద్దని అన్నారు.అపరిచిత లింక్‌లపై క్లిక్ చేయవద్దని, ఫోన్ ద్వారా వచ్చిన అటాచ్‌మెంట్‌లను తెరవవద్దని సూచించారు.

డిజిటల్ అరెస్ట్, బెదిరింపుల గురించి భయపడవద్దని అన్నారు. డబ్బును బదిలీ చేయమని లేదా నగదు తీసుకుని ఇవ్వమని కోరే ఇటువంటి అభ్యర్థనలను విశ్వసించవద్దని పేర్కొన్నారు. మీరు ఏదైనా మోసానికి గురైనట్లు భావిస్తే, వెంటనే




సైబర్ క్రైమ్ పోలీసులకు లేదా 1930 లేదా tgcsb.police.gov.in వెబ్సైట్ లో ఉన్న చాట్ బాట్ కు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ పోస్టర్ విడుదల కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఇంచార్జి వెంకట రమణ, ఆర్.ఎస్.ఐ శ్రావణి, సైబర్ క్రైమ్ సిబ్బంది ఉన్నారు.

# కేటీఆర్ తో సన్మానం జామిడి గ్రామసర్పంచ్ ఈర గోల్ల అశోక్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ హైదరాబాద్ తెలంగాణ భవన్ లో బోథ్ నియోజకవర్గ సర్పంచ్ ల సన్మాన కార్యక్రమంలో భాగంగా BRS పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో మరియు బోథ్ నియోజకవర్గం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చే నూతనగా జామిడి గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన BRS నాయకులు ఈరగొల్ల అశోక్ కి సన్మానం..



సన్మానిస్తున్న దృశ్యం

# విజేతలకు ఘన సన్మానం: యువ నాయకుల అభినందనలు

## గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సాగాలి: బత్తుల భారత్, బొల్లం రఘు యెన్నం రమేష్

మెట్ పల్లి అమృత్ తెలంగాణ డిసెంబర్ 29: ఇటీవల ముగిసిన పంచాయతీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన నూతన ప్రజా ప్రతినిధులకు యువ నాయకులు రాజేశ్వరరావు పేట్ సర్పంచ్ ( కట లక్ష్మీ శ్రీదర్ ) ఉప సర్పంచ్ ( ఎపూరి రచన రాజు ) మేడిపల్లి 8 వ వార్డు సభ్యులు ( పింజరి హరీష్ ) లను బత్తుల భారత్. బొల్లం రఘు, యన్నం రమేష్ ఘనంగా సన్మానం చేశారు.ఈ సందర్భంగా మెట్ పల్లి పట్టణంలోని అంబేద్కర్ పార్కులోని అంబేద్కర్ విగ్రహం ముందు విజేతలకు శాలువాలు కప్పి, అభినందనలు తెలిపారు. అభివృద్ధే ప్రధాన అజెండా కావాలి ఈ కార్యక్రమంలో యువ నాయకుడు బత్తుల భారత్ మాట్లాడుతూ.. ప్రజలు మీపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని కోరారు.మౌలిక సదుపాయాల కల్పనలోనూ,ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ



చేరవేయడంలోనూ నూతన నాయకులు కీలకంగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రేవంత్, పవన్, గోపాల్, సంజీవ్, ప్రశాంత్,లు పాల్గొన్నారు.


# అదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరణ





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ డిసిసి కార్యవర్గం నియామకాల ప్రక్రియలో భాగంగా జిల్లా కేంద్రంలోని డిసిసి కార్యాలయంలో దరఖాస్తులు తీసుకోవడం జరిగింది. కార్యక్రమానికి అబ్జర్వర్స్ చిట్ల సత్యనారాయణ(టీపీసిసి ఉపాధ్యక్షులు), తహార్ బిన్ హందన్( రాష్ట్ర ఉర్దూ అకాడమీచైర్మన్) లు ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ రెడ్డి, దామోదర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు గుడిపెల్లి నగేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిసిసి కార్యవర్గానికి సంబంధించి పలువురు దరఖాస్తు పత్రాలను సమర్పించారు

# రైతులందరికీ అవసరమైన మేరకు యూరియాను అందించాలి: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.





వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ లు

నిర్మల్ జిల్లా డిసెంబర్ 29 అమృత్ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి రైతుకు పంటకు సరిపడినంత యూరియా తప్పనిసరిగా అందించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో యూరియా పంపిణీ పై వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎక్కడ కూడా యూరియా కొరత లేదని స్పష్టం చేశారు. రైతులు పండించబోయే యాసంగి పంటకు సంబంధించి అవసరమైనంత మేరకు యూరియా అందుబాటులో ఉందని వివరించారు. రైతులకు యూరియా పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు ఉండకూడదని పేర్కొన్నారు. అతి త్వరలోనే అన్ని జిల్లాలలో యూరియా బుకింగ్ కోసం, ఫర్టిలైజర్ బుకింగ్ అప్లికేషన్ అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. రైతులు, ఎరువుల కొరత అంటూ వస్తున్న పుకార్లను నమ్మవద్దని సూచించారు. ఎరువుల కృత్రిమ సృష్టించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోజువారీగా యూరియా అమ్మకాలకు సంబంధించి ప్రారంభ నిల్వ, ముగింపు నిల్వ వివరాలను తమకు అందజేయాలని చెప్పారు. ఇకనుంచి ఉదయం ఏడు గంటలకు కాకుండా, ఆరు గంటల నుంచే రైతులకు యూరియా అమ్మకాలు ప్రారంభించాలని చెప్పారు. యూరియా కొనుగోలుకు వచ్చిన రైతులకు ఇబ్బందులు కలగకుండా టెంటు, త్రాగునీరు తదితర వసతులు కల్పించాలని అన్నారు. యూరియా పంపిణీలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్న రాష్ట్రస్థాయి హెల్ప్ లైన్ నంబరు 18005995779 ను సంప్రదించవచ్చునని మంత్రి తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కడా కూడా యూరియా కొరత లేదని తెలిపారు. అందుబాటులో ఉన్న యూరియా మొత్తాన్ని, రైతుల అవసరాల మేరకు పకడ్బందీగా పంపిణీ చేయాలని సూచించారు. అవసరమైనంత యూరియా అందుబాటులో ఉందని, యూరియా కొరత అంటూ వస్తున్న పుకార్లను నమ్మవద్దని రైతులకు సూచించారు. యూరియా పంపిణీ విషయంపై రైతులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు. మండల స్థాయి వ్యవసాయ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు యూరియా పంపిణీ ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించాలని తెలిపారు. ఖచ్చితంగా ఉదయం ఆరు గంటల నుంచి యూరియా అమ్మకాలు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన పంటల అధికారి రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# విధి కుక్కల పట్టి వేత.





మెట్ పల్లి అమృత్ తెలంగాణ డిసెంబర్ 29: మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ టి మోహన్ ఆదేశాలతో స్వతంత్ర ఎనిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ద్వారా మెట్పల్లి పట్టణంలో వీధి కుక్కలను పట్టడం జరుగుతుంది కమిషనర్ మాట్లాడుతూ మెట్పల్లి పట్టణంలో వీధి కుక్కలను పట్టడం జరుగుతుందని పట్టిన వీధి కుక్కలను ఎనిమల్ హెల్త్ సెంటర్కు తరలించి ఆపరేషన్ చేసిన తర్వాత తిరిగి వీధులలో వదిలిపెట్టడం జరుగుతుందని తెలిపినారు. ఇక ప్రతిరోజు అనివార్డులలో వీధి కుక్కలు పట్టిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ అక్షయ్ కుమార్,ముజీబ్,నరేష్, చంద్రశేఖర్,పాల్గొన్నారు.

# నీతి,నిజాయితీతో విధులు నిర్వహించే ఉద్యోగస్తులకు ఉత్తమ అవార్డులు అందజేయాలి.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల హనుమండ్ల యాదవ్ ఎండి రైసోద్దీన్.



మెట్ పల్లి అమృత్ తెలంగాణ డిసెంబర్ 29: విధి నిర్వహణలో వృత్తి ధర్మాన్ని మరచి, కాసుల కోసం కక్కుర్తి పడుతూ.. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ప్రస్తుత సమాజంలో తన విధి నిర్వహణే ప్రధాన ధ్యేయంగా, ఉద్యోగ ధర్మాన్ని చిత్తశుద్ధితో నిర్వహిస్తున్న పట్టణ రెవెన్యూ ఇన్స్పెక్టర్ కాంతయ్యను పలువురు అభినందిస్తున్నారు. స్థానిక మెట్పల్లి తహసీల్ కార్యాలయంలో ఆర్ ఐ గా విధులు నిర్వహిస్తున్న కాంతయ్య.. అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యలను సకాలంలో పరిష్కరించడంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక పార్టీ ప్రతినిధుల మధ్య కొమిరెడ్డి నివాస ప్రాంగణంలో జరిగిన సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు హనుమండ్ల యాదవ్ మాట్లాడారు. నీతి, నిజాయితీతో విధులు నిర్వహించే ఉద్యోగులు చాలా అరుదుగా ఉంటారని. అంకితభావంతో పనిచేసే ఆర్ ఐ కాంతయ్య లాంటి ఉద్యోగులతో ప్రభుత్వ ప్రతిష్ట ఇనుమడిస్తుందని,రానున్న రిపబ్లిక్ డే సందర్భంగా ప్రభుత్వం ఇలాంటి ఉద్యోగస్తులను గుర్తించి, వారి సేవకు గుర్తుగా ఉత్తమ అవార్డులను అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంజమ్మ (కమ్మర్పల్లి) పార్టీ సీనియర్ నాయకులు రైసుద్దీన్, పట్టణ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంగు గంగాధర్, మఖిమ్,డాక్టర్ ప్రతాప్, పొన్నాల ఎల్లేష్, రాజేష్,రమేష్,తదితరులు పాల్గొన్నారు.

# న్యూ ఇయర్ వేడుకలో జాగ్రత్తలు పాటించాలి: డీఎస్పీ

మిర్యాలగూడ :అమృత్ తెలంగాణ: మిర్యాలగూడ డివిజన్ లో ప్రజలు న్యూ ఇయర్ వేడుకలో జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ రాజశేఖర్ రాజు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక డిఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ 31 రాత్రి 11 గంటలకు మూసివేయాలని వ్యాపారులకు సూచించారు. కేకు లు విక్రయించే బేకరి దుకాణాలు ముందుగానే మూసి వేయాలన్నారు.ముక్యంగా యువకులు మద్యం తాగి రోడ్లపైకి రావొద్దని, విధుల్లో, సెంటర్లో కేకులు బహిరంగనగా కట్ చేయొద్దన్నారు. ఎవరి ఇంట్లో వారే వేడుకలు జరుపుకోవాలన్నారు. ఆ రోజు రాత్రి ట్రిబుల్ రైడింగ్ చేస్తే కారిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రి అంత డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామని, గంజాయి, డ్రగ్స్ పరీక్షలు చేస్తామన్నారు.

బాణాసంచులు కూడా కాల్చవద్దన్నారు. డీజే లు ఉపయోగించకూడని దానిపై నిషేధం ఉందన్నారు. శాంతియుతంగా న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని ఇవ్టీజింగ్, మహిళను వేధించిన కఠిన చర్యలు తీసుకుంటామని అవసరమైతే చేసిన నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం




సంక్రాంతి సందర్భంగా గాలిపటాలు ఎగరేసేందుకు పిల్లలు ఉత్సాహం చూపుతారని, చైనా మంజా పై నిషేధం ఉందని పోలీసులు తనిఖీలు చేశారని చైనా మంజా అమ్మితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. గతంలో కంటే ఏడాది క్రైమ్ రేటు తగ్గిందని చెప్పారు. డివిజన్లో 221 చీటింగ్ కేసులు నమోదు చేశామన్నారు. గంజాయి పై ఉక్కు పాదం 18 కేసులు నమోదు చేసి 43 మందిని అరెస్టు చేశామన్నారు. మిర్యాలగూడ బైపాస్ రోడ్డులో రోడ్డు ప్రమాదాల నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సిఐలు నాగభూషణం, పి ఎన్ డి ప్రసాద్, ఎస్ఐ లు రాంబాబు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెయింటర్స్ అవగాహన కార్యక్రమం

అడ్డగూడూర్ :అమృత్ తెలంగాణ: యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలో ఓం సాయిరాం పెయింట్స్ షాప్ డీలర్ ధర్మ శెట్టి సాయికుమార్ షాపు ఆవరణంలో జెఎస్డబ్ల్యుటిఎస్ ఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెయింటర్స్ కి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జె ఎస్ డబ్ల్యూ టి ఎస్ ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పెయింటర్స్ కి పెయింట్ ఎలా వేయాలి, ఏ ఏ కలర్లు ఎలా కలపాలి.. కలర్ లో ఉన్నటువంటి నాణ్యత గురించి అవగాహన కల్పించారు. పెయింట్ లో ఉన్నటువంటి మెలుకువల



గురించి సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెయింటింగ్ యూనియన్ అధ్యక్షుడు సూరారం బాబు కుమార్, ఉపాధ్యక్షులు బాల్యంల మహేందర్, గజ్జెల్లి బాబు, సూరారం దేవానందం, ఇటికాల పరిసరాములు, బోడ యాదగిరి, బండి మహేష్, పిల్లి ఆంజనేయులు, వడ్డే రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో బోల్తాపడిన స్కూల్ బస్సు..



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: స్కూలు బస్సు అదుపుతప్పి బోల్తా పడిన ఘటన రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. క్రిస్మస్ పండుగల వేళ రిషి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు స్కూలు బస్సులో హైదరాబాద్‌లోని జలవిహార్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలోనే వారి బస్సును వెనుక నుంచి కారు ఢీకొట్టగా శంషాబాద్ సిగ్నల్ వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. అయితే, ఈ ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 60 మందికి పైగా విద్యార్థులు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ ప్రమాదంలో పలువురు విద్యార్థులు గాయలైనట్లుగా సమాచారం. స్థానికుల సమాచారం మేరకు స్పాట్‌కు చేరుకున్న పోలీసులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు.

# జిల్లాలో ఎరువుల కొరత లేదు



రాజన్న సిరిసిల్ల :అమృత్ తెలంగాణ: జిల్లాలో ఆయా పంటల సాగుకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు. యూరియా విషయమై రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. ఎరువులను రైతుల పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎరువులు పక్కదారి పట్టకుండా.. ఇతర అవసరాలకు వాడకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని సొసైటీలు, ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా అందుబాటులో ఉందని సూచించారు. కనీస సదుపాయాలు కల్పించాలని తెలిపారు. జిల్లాలో యాసంగి సాగు కోసం మొత్తం 21 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, ఇప్పటి దాకా 10 వేల 991 మెట్రిక్ టన్నులు వచ్చిందని వెల్లడించారు. మిగతా ఎరువులు తెప్పిస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ డీలర్లు 223, పీసీసీఎస్ షాపులు 54, డీసీఎంఎస్ 16, ఏఆర్ ఎస్ కే 13 ఎరువుల షాపులు ఉన్నాయని వెల్లడించారు. అన్ని షాప్ లలో రోజూ ఉదయం ఆరు గంటల నుంచి విక్రయాలు మొదలు పెట్టాలని, ఎరువుల విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

## కేకే కు తగిన స్థానం కల్పించాలని గాంధీభవన్ కు తరలిన కాంగ్రెస్ నేతలు



రాజన్న సిరిసిల్ల :అమృత్ తెలంగాణ: రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, ఇప్పటివరకు ఏ పదవి లేకున్నా నియోజకవర్గ ప్రజల గురించి నియోజకవర్గ అభివృద్ధి గురించి అహర్నిశలు కష్టపడుతూ ప్రజలతో మమేకమై ఉంటున్నారని సిరిసిల్ల కాంగ్రెస్ నాయకులు అన్నారు. అటువంటి ఉద్యమ నాయకున్నీ అధిష్టానం విస్మరించడం తగదనీ, కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున గాంధీ భవన్ కు తరలి వెళ్లారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్ యుఐ నాయకులు, జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, హైదరాబాదుకు భారీగా తరలివెల్లి కాంగ్రెస్ అధిష్టానానికి తమ విన్నపాన్ని వెల్లడించారు. సానుకూలంగా స్పందించిన అధిష్టానం త్వరలోనే వారికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ఆరోగ్య జాతర



బజార్ హాత్నూర్ :అమృత్ తెలంగాణ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఆరోగ్య జాతర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ప్రతిరోజు నేర్చుకుని ఆరోగ్య కళాశాల కార్యక్రమాలను వారి యొక్క అనుభవాలను ఈ కార్యక్రమం ద్వారా తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, పోషణ ,మానసిక ఆరోగ్యం, ఉద్వేగ పరిపక్వత యాంటీ డ్రగ్స్, కాలానుగుణ వ్యాధులు, వ్యక్తిత్వ వికాసము తదితర అంశాలను సంవత్సరమంతా తెలుసుకొని దానిని అధ్యాయించుకున్నట్లు విద్యార్థులు తెలియజేశారు. ఇటువంటి కార్యక్రమాన్ని కళాశాలలో నిర్వహించినందున జిల్లా కలెక్టర్ కి, అధ్యాపకులందరికీ విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సునీల్ కుమార్, ఆరోగ్య కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ షిండే జ్ఞానేశ్వర్, అధ్యాపకులు ప్రదీప్ కుమార్, భీమేష్, అశోక్ రెడ్డి, నవీన్ రెడ్డి, వనజ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భూతాయి కే లో క్రికెట్ టోర్నమెంట్



బజార్ హాత్నూర్ :అమృత్ తెలంగాణ: మండలంలోని భూతాయి కే గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు యువ జన సంఘ సభ్యులు పేర్కొన్నారు. ఈ పోటీలను స్థానిక సర్పంచ్ మాడావి సింధు చేతిలో మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆటలు యువతలో మంచి క్రమశిక్షణను ఐకమత్యాన్ని పెంపొందించడంతోపాటు శారీరకంగా దృఢత్వాన్ని కలిగి మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని అన్నారు. యువత క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాడవి జైతు, తుడసం వినాయక రావు, బీమ్ రావ్, మారుతి, సంతోష్, విశ్వనాథ్, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తెలుగు అమ్మాయిని టాలెంట్ గుర్తించాల్సిందే..!



టాలీవుడ్ లో సైడ్ రోల్స్ తో పాటుగా చిన్న సినిమాల్లో హీరోయిన్ గా చేస్తూ మెప్పిస్తున్న భామ పూజిత పొన్నాడ. తెలుగు అమ్మాయి అయిన పూజిత రంగస్థలం లో ఆది పినిశెట్టి లవర్ గా కనిపించి అలరించింది. అందం అభినయం ఉన్నా సరే అమ్మడికి లక్ కలిసి రావట్లేదు. ఆమె చేస్తున్న సినిమాలేవి ఆడియన్స్ కి పెద్దగా రిజిస్టర్ అవ్వట్లేదు. వచ్చిన అర కొర అవకాశాలనే చేస్తూ కెరీర్ వెళ్లదీస్తుంది అమ్మడు. సినిమాల కన్నా ఫోటో షూట్స్ తో ఎక్కువ క్రేజ్ తెచ్చుకుంటుంది పూజిత. అందుకే అమ్మడి సోషల్ మీడియా ఫాలోవర్స్ కూడా ఎక్కువగానే ఉన్నారు. తరచూ తన లేటెస్ట్ ఫోటో షూట్స్ తో ఫాలోవర్స్ ని అలరిస్తుంది పూజిత. అయితే తన గ్లామర్ సైడ్ కన్నా తన క్యూట్ లుక్స్ తో ఆడియన్స్ ని ఎట్రాక్ట్ చేస్తుంది. లేటెస్ట్ గా అమ్మడు బీచ్ లో శారీ లుక్ లో ఫోటో షూట్ చేసింది. అది చూసిన కుర్రాళ్లు పూజిత నా హృదయ దేవత నువ్వే అంటూ కామెంట్స్ చేస్తున్నారు. వైట్ కలర్ శారీలో వావ్ అనిపించేలా అమ్మడి అందాలు కేక పెట్టిస్తున్నాయి. సరైన ఛాన్స్ వస్తే చాలు తన టాలెంట్ ఏంటో చూపించాలని చూస్తున్న పూజిత పొన్నాడకి అలాంటి అవకాశం రావట్లేదని చెప్పొచ్చు. లాస్ట్ ఇయర్ ఓదెల రైల్వేస్టేషన్ సినిమాలో సెకండ్ హీరోయిన్ గా నటించిన పూజిత ఆకాశ వీధుల్లో అనే సినిమాలో హీరోయిన్ గా నటించింది. ప్రస్తుతం రవితేజ రావణాసుర తో పాటుగా తమిళంలో భగవాన్ సినిమా చేస్తుంది పూజిత. తెలుగు అమ్మాయి కదా గ్లామర్ విషయంలో అడ్డు చెబుతుందేమో అనుకుంటే తను చేస్తున్న సినిమాల్లో లిప్ లాక్స్ ఇస్తూ ఫుల్ కోపరేట్ చేస్తుంది పూజిత. అలాంటిది స్టార్ ఛాన్స్ వస్తే రెచ్చిపోకుండా ఉంటుందా చెప్పండి. కానీ అలాంటి ఛాన్స్ ఒకటి ఇచ్చి ఆమెను ఎంకరేజ్ చేస్తే మాత్రం పూజిత నెక్స్ట్ లెవల్ లో ఉంటుంది.

# 'పౌజీ' కోసం వాళ్లిద్దరి మధ్యా పోటీ!






పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా భారీ లవ్ అండ్ వార్ ని హను రాఘవపూడి తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా భారీ లవ్ అండ్ వార్ పౌజీ ని హను రాఘవపూడి తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. 1800 ఏళ్ల కాలం నాటి పీరియాడిక్ స్టోరీలో అద్భుతమైన లవ్ స్టోరీని ఆవిష్కరి స్తున్నాడు. ఇందులో అందమైన ప్రేమ కథతో పాటు అంతకు మించి కళ్లు చెదిరే భారీ యాక్షన్ ఎపిసోడ్లు కూడా ఉంటున్నాయి. ఇందులో డార్లింగ్ కి ప్రభాస్ కి జోడీగా ఇమ్మాన్వీని ఎంపిక చేసిన సంగతి తెలిసిందే లాంచింగ్ రోజే అమ్మడు అభిమానుల మనసులు దొచేసింది. తన అందచందాలతో నెట్టింట సంచల నమైంది. అటుపై డాన్సులో తానెంత ప్రోఫెషనల్ అన్నది ఓ వీడియో ద్వారా అర్దమైంది. అంతటి ట్యాలెం టెడ్ బ్యూటీ ఇంతకాలం ఎక్కడ ఉంది? అనే చర్చకు తెర తీసిందంటే? ఇమాన్వీ పై ఏ రేంజ్ లో హై వచ్చిందో అర్ధమవుతుంది. ఇమాన్వీలో ఇవన్నీ చూసే హను ఛాన్స్ ఇచ్చాడన్నది అంతే వాస్తవం. కంటెంట్ లో ఏది బెస్ట్ అంటే..? అయితే ఇందులో సెకెండ్ లీడ్ కూడా ఒకటుంది. ఆ పాత్ర కోసం ఇప్పటికే మృణాల్ ఠాకూర్ ను పరి శీలిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. కానీ మృణాల్ నటిస్తే ఫ్రెష్ ఫీల్ రాదు ? అన్న ఆలోచనలోనూ హను ఉన్నాడుట. ఈ నేపథ్యంలోప్రత్యామ్నాయంగా బాలీవుడ్ బ్యూటీ దిశాపటానీని పరిశీలిస్తున్నారుట. కల్కి 2898 లో దిశా నటించిన సంగతి తెలిసిందే. తెరపై కనిపించింది కాసేపే అయినా ప్రేక్షకుల్ని ఎంగేజ్ చేసింది. ఈ నేపథ్యంలో మృణాల్ కంటే దిశా పటానీ అయితే బాగుంటుందని మేకర్స్ భావిస్తున్నారుట. అయితే ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని సమాచారం. దీంతో మృణాల్–దిశా పటానీ మధ్య ఛాన్స్ విషయంలో పోటీ కనిపిస్తుంది. మృణాల్ ఠాకూరు కూడా ఇప్పటి వరకూ ప్రభాస్ తో నటించే ఛాన్స్ రాలేదు. అలాంటి అవకాశం కోసం ఎదురు చూస్తోంది. ఇప్పుడా ఛాన్స్ వచ్చినట్లే వచ్చి చేజారుతున్నట్లు కనిపిస్తుంది.

# శ్రీలంక తీరంలో బికినీ బ్యూటీ వేషాలు

ఇటీవల సమ్మర్ హీట్ అంతకంతకు పెరుగుతోంది. దీంతో సెలబ్రిటీలంతా మాల్దీవుల ప్రయాణంలో ఉన్నారు. ఇటీవల సమ్మర్ హీట్ అంతకంతకు పెరుగుతోంది. దీంతో సెలబ్రిటీలంతా మాల్దీవుల ప్రయాణంలో ఉన్నారు. గోవా టూరిజం అంతకంతకు దిగజారుతోందని నివేదికలు ఉన్నా .. లక్ష్యద్వీప్ టూరిజాన్ని డెవలప్ చేయాలని ప్రభుత్వం పూనుకున్నా.. మాల్దీవులకు డిమాండ్ తగ్గలేదు. ఒంటరి దీవుల్లో చిల్ అయ్యేందుకు తారలు ఆసక్తిగా ఉన్నారు. అయితే ఇతరులకు భిన్నంగా నేహా శర్మ ఇటీవల శ్రీలంక తీరంలో తళుక్కున మెరిపించింది. బ్లాక్ మోనోకినిలో హృదయాలను కొల్లగొట్టింది. బీచ్ లో అందమైన భంగిమలతో నేహా శర్మ చెలరేగిపోయింది. నేహా ఫిట్‌నెస్ ఫ్రీక్ అన్న సంగతి తెలిసిందే. జిమ్‌లు స్టూడియోల వెలుపల ఎక్కువగా కనిపిస్తుంది. ఇప్పుడు కూడా జిమ్ లో కసరత్తులు చేసాకే ఇలా బీచ్ లో ప్రత్యక్షమైంది. ప్రస్తుతం ఈ ఫోటోలను యువతరం వైరల్ గా షేర్ చేస్తున్నారు. ఈసారి సీక్వెల్‌లో చించేద్దాం! కెరీర్ మ్యాటర్ కి వస్తే.. నేహా చివరిగా విజయ్ దేవరకొండఫ్యామిలీ స్టార్‌లో అతిధి పాత్రలో కనిపించింది. కానీ ఈ సినిమా ఫ్లాపైన సంగతి తెలిసిందే. టాలీవుడ్ బాలీవుడ్ లో కొన్ని పెద్ద సినిమాల్లో నటించినా కానీ నేహా శర్మ ఫేట్ మారలేదు. కాంపిటీషన్ లో ఈ భామ వెనకబడింది. నేటితరం చిల్లింగ్ గాళ్స్ రేసులో దూసుకుపోతున్నా, నేహా కేవలం మోడలింగ్ అసైన్ మెంట్స్ ఇన్ స్టా పోస్టులకు పరిమితమైంది. హేరాఫేరి 3 లో నటిస్తోందని కబురందినా కానీ ఈ సినిమా తాజా అప్ డేట్ అందలేదు.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# వీరమల్లుతో అందాల భామ.. అంతా సిద్ధం..!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ క్రిష్ కాంబోలో వస్తున్న భారీ బడ్జెట్ మూవీ హరి హర వీరమల్లు సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. సినిమాలో ఇప్పటికే నిధి అగర్వాల్ జాక్వెలిన్ లాంటి అందాల భామలు నటిస్తుండగా మరో అందాల భామ నోరా ఫతేహి కూడా భాగం అవుతుందని తెలుస్తుంది. బాహుబలి సినిమాలో ఇరుక్కుపో సాంగ్ తో పాపులర్ అయిన నోరా ఓ పక్క బాలీవుడ్ సినిమాలతో బిజీ బిజీగా ఉంటుంది. అయితే సౌత్ నుంచి ముఖ్యంగా టాలీవుడ్ నుంచి ఏ చిన్న ఛాన్స్ వచ్చినా సరే కాదనకుండా చేస్తుంది అమ్మడు. పవన్ కళ్యాణ్ హరి హర వీరమల్లు సినిమా లో కూడా నోరా ఫతేహి రిజిస్టర్ అయ్యే రోల్ లో నటిస్తుందని తెలుస్తుంది. ఈ నెల చివరన మొదలయ్యే షెడ్యూల్ లో నోరా పాల్గొంటుందని తెలుస్తుంది. ఆమెతో కీలక సన్నివేశాలు ఈ షెడ్యూల్ లో షూట్ చేస్తారని తెలుస్తుంది. వీరమల్లు సినిమాలో తన పాత్రతో మరోసారి తెలుగు ఆడియన్స్ ని అలరించనుంది నోరా ఫతేహి. వచ్చిన ప్రతి ఛాన్స్ వదలకుండా చేస్తూ వస్తుంది నోరా. అందాల భామ బాలీవుడ్ సినిమాల్లో ఎక్కువగా స్పెషల్ సాంగ్స్ లో అలరిస్తుంది. తెలుగులో కూడా అలాంటి ఛాన్స్ లే వస్తుండటంతో ఇక్కడ కూడా తన టాలెంట్ చూపిస్తుంది. ఇక వీరమల్లు లాంటి ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ లో నటించడం ఆమె కెరీర్ గ్రోత్ కి హెల్ప్ చేస్తుందని చెప్పొచ్చు. హరి హర వీరమల్లు సినిమా క్రిష్ ఎంతో అద్భుతంగా తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తుంది. సినిమాలో ఫ్యాన్స్ అంతా సరికొత్త పవన్ కళ్యాణ్ ని చూస్తారని తెలుస్తుంది. కీరవాణి మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమాకు మ్యూజిక్ కూడా మరో హైలెట్ అయ్యేలా జాగ్రత్త వహిస్తున్నారని తెలుస్తుంది. కొన్నాళ్లుగా షూటింగ్ వాయిదా పడుతుండగా ఈసారి పవన్ సినిమా పూర్తి చేసేందుకు పూర్తి డేట్స్ ఇచ్చినట్టు తెలుస్తుంది. ఏ.ఎం.రత్నం నిర్మిస్తున్న ఈ సినిమా పవర్ స్టార్ ఫ్యాన్స్ అందరిని మెప్పించేలా చేస్తుందని అంటున్నారు. ఈ సమ్మర్ రిలీజ్ ప్లాన్ చేస్తున్న ఈ సినిమా సమ్మర్ కి కుదరకపోతే దసరాకి వాయిదా వేసే ఛాన్స్ ఉందని టాక్.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com